## ఆదిలాబాద్‌లో తొలి ట్రిపుల్ తలాక్ కేసు

ఎదులాపురం, మే 18 : ఆదిలాబాద్ జిల్లాలో తొలి ట్రిపుల్ తలాక్ కేసు నమోదు చేసినట్టు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన ఠాణాలో కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్‌లోని కేఆర్కే కాలనీకి చెందిన జాస్మిన్ (28)కు అదే కాలనీకి చెందిన అబ్దుల్‌అతీక్‌తో 2017లో వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. రెండేండ్లుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. గతేడాది ఫిబ్రవరిలో భర్తపై వేధింపుల కేసు నమోదైంది. భార్యకు ట్రిపుల్ తలాక్ చెప్పగా బాధితురాలు శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సెక్షన్ 4 ఆఫ్ ది ముస్లిం ఉమెన్ (వివాహ హక్కుల రక్షణ) చట్టం 2019 ప్రకారం కేసు నమోదు చేశారు.

## బస్సులో నుంచి జారిపడి మహిళ మృతి

**ఉచిత బస్సు పథకం తెచ్చిన తంటా**

కొణిజర్ల, మే 18 : మహిళలకు ఉచిత బస్సు పథకంతో బస్సులన్నీ కిక్కిరిసిపోతున్నాయి. ఈ క్రమంలోనే ఓ మహిళ బస్సులో చోటులేక పుట్‌బోర్డుపై నిలబడటంతో ప్రమాదవశాత్తు జారిపడి ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటన ఖమ్మం జిల్లాలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొణిజర్ల మండల పరిధిలోని పెద్దమునగాలకు చెందిన దూరి అనూష (26) ఖమ్మం నగరంలోని డీమార్ట్‌లో పనిచేస్తున్నది. రోజు మాదిరిగానే ఖమ్మం వెళ్లేందుకు శనివారం ఉదయం కొణిజర్లలో బస్సు ఎక్కి పుట్‌పాత్‌పై నిలబడింది. బస్సు ఒక్కసారిగా ముందుకు కదలడంతో జారి వెనుక టైరు కిందపడటంతో అనూష అక్కడికక్కడే మృతిచెందింది. కొణిజర్ల ఎస్సై జే శంకర్‌రావు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి భర్త అశోక్, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సీపీఎం మద్దతు

హైదరాబాద్, మే 18(నమస్తే తెలంగాణ): నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. ఇండియా కూటమిలో భాగంగా మద్దతునిస్తున్నామని వెల్లడించారు.

# ‘పవిత్ర’ బంధం విషాదాంతం!

**సోషల్ మీడియాలో వైరలైన శిల్ప-చందు-పవిత్ర ట్రయాంగిల్ లవ్‌స్టోరీ**

**ప్రేమించి, పెండ్లాడిన భార్య, బిడ్డలను వదిలేసి తోటినటితో చందు సహజీవనం**

**యాక్సిడెంట్‌లో పవిత్ర చనిపోవడంతో ఆమె లేనిలోకంలో ఉండలేక ఆత్మహత్య**

**పవిత్ర వద్దకే వెళ్తానని పోస్టులు.. భన్సీలాల్‌పేట్‌లో ముగిసిన అంత్యక్రియలు**



చందు, పవిత్ర (ఫైల్)

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 18 (నమస్తే తెలంగాణ): త్రినయని టీవీ సీరియల్ నటుడు చందు అలియాస్ చంద్రకాంత్ ఆత్మహత్యతో ఎన్నో కొత్తకోణాలు వెలుగులోకి వస్తున్నాయి. శుక్రవారం మణికొండలోని సొంత ఫ్లాటులో ఉరేసుకోగా.. చందు వివాహ బంధంలో ఉన్న ట్విస్టులన్నీ బయటపడుతున్నాయి. చిన్ననాటి నుంచే శిల్ప అనే అమ్మాయి ప్రేమించి.. పెద్దల అంగీకారంతో 2015లో పెండ్లి చేసుకున్న చందు.. ఇద్దరు పిల్లలకు తండ్రయ్యాడు. కానీ, ఐదేండ్ల కిందట పరిచయమైన పవిత్ర జయరాం కోసం కన్నవారిని, కట్టుకున్న శిల్పను, అల్లారు ముద్దుగా పెరిగిన ఇద్దరు పిల్లలను (కొడుకు, కూతురు) వదిలేసి చివరకు తానే బలవన్మరణానికి పాల్పడటం చర్చనీయాంశమైంది. ఏ పనిలేకుండా తిరుగుతున్న భర్త చందును గాడిలో పెట్టేందుకు శిల్ప చేయని ప్రయత్నమంటూ లేదని తెలిసింది. అతడితో ఐటీ కంపెనీ పెట్టించిందని సమాచారం. అయినా, సినిమా, సీరియళ్లలో చాన్స్ కోసం ప్రయత్నాలు చేశాడని, అనూహ్యంగా త్రినయని సీరియల్‌లో అవకాశం రావడం, ఐదేండ్ల కిందట పవిత్ర జయరాంతో ఏర్పడిన పరిచయం, సాన్నిహిత్యం.. ప్రేమ, పెండ్లి బంధాన్ని దూరం కూడా దూరం చేసిందని సన్నిహితులు చెప్తున్నారు. భార్యాపిల్లలను వదిలి మణికొండలో చందు-పవిత్ర నివాసం ఏర్పాటు చేసుకున్నట్టుగా తెలిసింది. అదే ఫ్లాటులో చందు ఉరేసుకున్నాడు.

### చందు పోస్టులు వైరల్

బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు కారు వస్తుండగా మహబూబ్‌నగర్ జిల్లా గత వారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రముఖ, తెలుగు కన్నడ నటి పవిత్ర జయరాం చనిపోయారు. పవిత్ర మరణం తర్వాత పూర్తిగా డిప్రెషన్‌లో పడిపోయిన చందు పూర్తిగా కోలేకపోయాడు. ఆమె చనిపోయిన తర్వాతనైనా భార్య, పిల్లలకు దగ్గర కాలేకపోయారు. పవిత్ర మనాదిలోనే ఉండిపోయాడు. పవిత్రమరణించిన నాటి నుంచి చందు ప్రతి రోజు ఆమె గురించి పోస్టులు పెడుతూనే ఉన్నారు. ఆత్మహత్యకు ముందు ‘ఈ రోజు పవిత్ర బర్త్ డే, మన జిమ్ కోచ్ కాల్ చేస్తున్నాడు.. వెళ్దాం రా పవిత్ర’ అంటూ సోషల్ మీడియాలో పోస్టు చేసినట్టు తెలిసింది. అదే సమయంలో సన్నిహితులతో వాట్సాప్‌లో చేసిన చాట్‌లోనూ తనకు వెళ్లాల్సిన టైమ్ వచ్చిందని, వెళ్లిపోవడమే కరెక్ట్.. అంటూ మెసేజ్ చేసినట్టుగా సమాచారం. అలాంటి పనులు చేయొద్దని వారించినా చందు వినిపించుకోలేదని, తనను పవిత్ర పిలుస్తున్నదని మెసేజ్‌లు పంపాడని తెలిసింది. ఒక్కసారి మామ అని పిలుస్తావా.. అంటూ ఇన్‌స్టాలో పంచుకున్నట్టుగా తెలిసింది. త్వరలోనే వీరి రిలేషన్ షిప్‌కు పెండ్లి కార్డు పడే సమయంలోనే ఈ ప్రమాదం జరగడం, అంతలోనే చందు తీవ్ర మనోవేదనతో ఆత్మహత్య చేసుకోవడం జరిగిపోయినట్టుగా సన్నిహితులు చెప్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. శనివారం భన్సీలాల్‌పేట్ శ్మశాన వాటికలో చందు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో చందు భార్య శిల్ప, పిల్లలు, తండ్రి వెంకటేశ్ పాల్గొన్నారు. మనవడితో కలిసి తండ్రి వెంకటేశ్ చితికి నిప్పంటించారు. చందు చివరి చూపు కోసం అభిమానులు, సన్నిహితులు, స్నేహితులు, తరలివచ్చారు.

## వివాహేతర సంబంధాలతో జీవితాలు నాశనం: శిల్ప

సీరియల్ నటుడు చందు ఆత్మహత్యపై ఆయన భార్య శిల్ప స్పందించారు. ఐదేండ్లుగా పవిత్రతో చందు సహజీవనం చేస్తున్నాడని, త్రినయని సీరియల్ ప్రాజెక్టు వచ్చినప్పటి నుంచి వారి మధ్య వివాహేతర సంబంధం కొనసాగిందని పేర్కొన్నారు. పవిత్ర మాయలో పడి తమను పట్టించుకోవడం మానేశాడని, ఇంటికి కూడా రాలేదని తెలిపారు. వివాహేతర సంబంధాలు మూలంగా జీవితాలు నాశనం అవుతున్నాయని, తమ జీవితం కూడా అలాగే అయిందని ఆవేదన వ్యక్తంచేశారు. పవిత్ర ఆకస్మిక మరణంతో చందు మానసిక ఒత్తిడికి గురయ్యాడని, ఇటీవల కత్తితో కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాని తెలిపారు. పవిత్ర.. నీ దగ్గరకు వస్తున్నా.. అని ఇన్‌స్టాలో మెస్సెజ్‌లు కూడా పెట్టాడని పేర్కొన్నారు. శుక్రవారం చందుకు ఫోన్ చేయగా, ఎత్తకపోయేసరికి అనుమానం వచ్చి తెలిసిన వారిని ఫ్లాటుకు పంపించగా, చందు ఫ్యానుకు ఉరేకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. తనకు తన పిల్లలకు న్యాయం చేయాలని శిల్ప వేడుకున్నారు.

## కాంగ్రెస్ డబ్బులు పంచింది!

- **తెలంగాణలో ఎప్పటికైనా మాదే అధికారం**
- **బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి**



హైదరాబాద్, మే18 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విచ్చలవిడిగా ఓటర్లకు డబ్బులు పంచిందని బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. సెక్రటేరియట్ వద్ద శనివారం మీడియా చిట్‌చాట్‌లో పలు అంశాలపై ఆయన స్పందించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో తనకు 15 ఏండ్లుగా మాటల్లేవని తెలిపారు. ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, చేవెళ్ల, మహబూబ్‌నగర్, మల్కాజిగిరి, సికింద్రాబాద్, జహీరాబాద్‌లో కచ్చితంగా గెలుస్తామని, భువనగిరి, వరంగల్ టఫ్ ఫైట్ ఉన్నదని, నాగర్‌కర్నూల్ కూడా గెలిచే అవకాశం ఉన్నదని అభిప్రాయం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఎప్పటికైనా తాము అధికారంలోకి వస్తామని చెప్పారు.

## ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ పార్టీకి షాక్

- **మున్సిపల్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం**

ఎల్లారెడ్డి, మే 18: కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యంపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. బీఆర్‌ఎస్‌కు చెందిన కుడుముల సత్యం, కాంగ్రెస్‌లో చేరిన 25 రోజులకే పదవిని కోల్పోవడం గమనార్హం. మొత్తం 12 మంది కౌన్సిలర్లు ఉండగా.. 11 మంది ఆయనపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని కోరుతూ గత నెల 24న కలెక్టర్‌కు తీర్మానపత్రం అందజేశారు. దీంతో శనివారం ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. అవిశ్వాస తీర్మానానికి 11 మంది కౌన్సిలర్లు మద్దతు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జూన్ 14 తరువాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఆర్డీవో స్పష్టం చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యంపై అవిశ్వాసం నెగ్గడం స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌కు ఊహించని పరిణామమని ఆ పార్టీ నేతలే పేర్కొనడం గమనార్హం.

## గ్రామ పంచాయతీ ఆస్తుల తనిఖీ చేపట్టాలి: సుల్తానియా

హైదరాబాద్, మే 18 (నమస్తే తెలంగాణ) : రాబోయే 10 రోజుల్లో రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఆస్తుల తనిఖీ చేపట్టాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా పంచాయతీ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా పంచాయతీ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, గ్రామస్థాయి ఆస్తుల నిర్వహణ స్థితిపై సమీక్షించారు. డంప్‌యార్డ్, వైకుంఠ ధామం, నర్సరీ, మొక్కల పెంపకం, ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణం, తడి, పొడి చెత్త సేకరణ తదితర పనులు సక్రమంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

## వ్యవసాయశాఖలో పదోన్నతులకు కమిటీ

హైదరాబాద్, మే 18(నమస్తే తెలంగాణ): వ్యవసాయశాఖలో గెజిటెడ్ పోస్టులకు పదోన్నతులు కల్పించేందుకు డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్స్ కమిటీ(డీపీసీ) ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ కార్యదర్శి రఘునందన్‌రావు శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ కమిటీకి వ్యవసాయ శాఖ డైరెక్టర్ కన్వీనర్‌గా, కో-ఆపరేషన్ శాఖ కమిషనర్, వ్యవసాయ శాఖ జాయింట్ సెక్రటరీ సభ్యులుగా ఉండనున్నారు.

## ఆస్తి కోసం కొడుకు దారుణం

- **కన్నతల్లి, ఇద్దరు కూతుళ్లను హతమార్చిన దుర్మార్గుడు**
- **ఖమ్మం జిల్లా తల్లాడ మండలం గోపాలపేటలో విషాదం**

సత్తుపల్లి, మే 18: ఆస్తి కోసం నవమాసాలు మోసి కనిపెంచిన తల్లిని, కడుపున పుట్టిన ఇద్దరు కూతుళ్లను ఓ దుర్మార్గుడు దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన శనివారం ఖమ్మం జిల్లా తల్లాడ మండలం గోపాలపేటలో చోటుచేసుకున్నది. గోపాలపేటకు చెందిన పిట్టల పిచ్చమ్మ (60) తన రెండో సంతానమైన వెంకటేశ్వరరావు కుమార్తెలు నీరజ (10), ఝాన్సీమోహిని (5)తో కలిసి గ్రామంలో నివసిస్తున్నది. పెద్ద మనుమరాలు నీరజ స్థానిక పాఠశాలలో 4వ తరగతి చదువుతుండగా చిన్న మనుమరాలు ఝాన్సీమోహిని అంగన్‌వాడీ పాఠశాలకు వెళ్తున్నది. వెంకటేశ్వరరావు భార్య కనకదుర్గ రెండేండ్ల క్రితం మృతిచెందడంతో కూతుళ్లు ఇద్దరూ నానమ్మ వద్దే ఉంటూ చదువుకుంటున్నారు. కోడలు చనిపోవడంతో పిచ్చమ్మ తనకున్న ఎకరం పొలంలో మనుమరాళ్లు నీరజ, ఝాన్సీమోహిని పేరుతో చెరో 10 గుంటలు రాసిచ్చింది. తాను 20 గుంటల భూమిని సాగు చేసుకుంటున్నది. వెంకటేశ్వరరావు తల్లాడకు చెందిన మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని ఖమ్మంలో నివాసం ఉంటున్నాడు. తల్లి పేరుతో ఉన్న అరెకరం భూమి, రేకులషెడ్డును తన పేరుమీదకు మార్చుకోవాలని కొన్ని నెలలుగా ప్రయత్నిస్తుండగా ఆమె అంగీకరించ లేదు. దీంతో తల్లి, పిల్లలను హతమార్చి ఆస్తి దక్కించుకోవాలని నిర్ణయించుకున్నాడు. ప్లాన్ ప్రకారం.. ఖమ్మంలో ఉంటున్న వెంకటేశ్వరరావు గోపాల్‌పాటలోని తన తల్లికి ఫోన్ చేసి.. తాను శనివారం ఇంటికి వస్తున్నానని చెప్పాడు. అర్ధరాత్రి దాటాక వెంకటేశ్వరరావు పిచ్చమ్మ, చిన్నారులు నిద్రిస్తున్న ఇంట్లోకి చొరబడి తల్లితోపాటు ఇద్దరు కూతుళ్లను హతమార్చి పరారయ్యాడు. గ్రామస్థులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వైరా ఏసీపీ రెహమాన్, సీఐ సాగర్, ఎస్సైలు వంశీకృష్ణ, భాగ్యరాజ్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను ట్రాక్టర్‌లో పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. రెండేండ్ల క్రితం వెంకటేశ్వరరావు భార్య కనకదుర్గను కూడా హత్య చేయడంతో పెద్దమనుషుల సమక్షంలో ఆస్తి పంపకాలు చేసినట్టు గ్రామస్థులు పోలీసులకు వివరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి పరారీలో ఉన్న వెంకటేశ్వరరావు కోసం గాలిస్తున్నారు.

## టీఎస్ నుంచి టీజీగా మార్పు

హైదరాబాద్, మే18 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర కోడ్‌ను టీఎస్ నుంచి టీజీగా మార్చాలని ప్రభుత్వం అన్ని శాఖలకు ఆదేశాలను జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే పలు కార్యాలయాలు తమ సంస్థల పేర్లను టీజీగా మార్చుకున్నాయి.

## 20 నుంచి యాదగిరిగుట్టలో జయంత్యుత్సవాలు

యాదగిరిగుట్ట, మే18: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి ప్రధానాలయం, అనుబంధ ఆలయాలైన పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంతోపాటు జనగామ జిల్లా బచ్చన్నపేట మండల దుబ్బగుంటపల్లి యోగానందనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 20 నుంచి 22 వరకు జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు అనువంశికధర్మకర్త నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు శనివారం వెల్లడించారు. 20న స్వస్తివాచనం, 21న లక్ష పుష్పార్చన, 22న మూలమంత్ర హవనం, నృసింహ జయంతి, నృసింహ ఆవిర్భావం, మహానివేదన, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహించి ఉత్సవాలు పరిపూర్ణం చేయనున్నట్లు చెప్పారు. ఉత్సవాల నేపథ్యంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య, శాశ్వత కల్యాణాలు, బ్రహ్మోత్సవాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.


